# ఆటోడ్రైవర్ల భిక్షాటన

- మహాలక్ష్మి పథకంపై హనుమకొండలో నిరసన
- కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆగ్రహం

హనుమకొండ చౌరస్తా, జనవరి 3: మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆటోడ్రైవర్లు బుధవారం హనుమకొండ వేయిస్తంభాల ఆలయ సమీపంలో భిక్షాటనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసి 25 రోజులు కావస్తోందని, దీంతో ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్లకు వెంటనే జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని భిక్షాటన ద్వారా నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. కమిటీ నాయకులు మడికొండ బాబు, కంకోట్ల జయరాం, పసునూరి బాబు, మంద శ్రీధర్‌రెడ్డి, చీకటి కుమార్, బొల్లం సంజీవ, గుండా రమేశ్, సముద్రాల సాయిలు, పసునూరి శ్రీనివాస్, ఖాజాపాషా, మాషుక్, రాజు, హైమద్, భూక్యా నాయక్, పద్మారావు పాల్గొన్నారు.



హనుమకొండలో భిక్షాటన చేస్తున్న ఆటోడ్రైవర్లు



భూపాలపల్లి మండలంలోని పుల్లూరురామయ్యపల్లిలో మల్చింగ్ విధానంలో సాగవుతున్న మిర్చి పంట



# మల్చింగ్‌తో.. మస్తు దిగుబడి

సాధారణం కంటే 30శాతం అదనం.. ఆసక్తి చూపుతున్న రైతాంగం

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 3(నమస్తే తెలంగాణ) : ఉద్యాన సాగులో మల్చింగ్‌తో రైతుల ప్రయోజనాలకు మరో మైలురాయి.. ముఖ్యంగా పంటలను సాగుచేసే రైతులు అధికారుల సలహాలు, సూచనల మేరకు మల్చింగ్ పద్ధతిని ఎంచుకుంటున్నారు. దీని వల్ల రైతులకు కలుపు నివారణ మందులు చల్లడం, కలుపు తీయడం వంటి ఎలాంటి ఖర్చులుండవు. ఒక ఎకరంలో మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేసేందుకు సుమారు రూ.12వేల వరకు ఖర్చవుతుంది. ఆ తర్వాత విత్తనాలు విత్తిన నాటి నుంచి పూర్తిగా పంట ఎండిపోయే వరకు ఎలాంటి కలుపు నివారణ పనులు చేయాల్సిన అవసరం లేదు. రైతులు మామూలుగా పండించే పంటల కంటే మల్చింగ్ పద్ధతితో 30 శాతం అధికంగా సాగు చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.



**విధానం..**

ఈ పద్ధతిలో 25, 60, 50, 75, 100 మైక్రాన్ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్‌ను పూలు, పండ్ల తోటలతో పాటు కూరగాయల మొక్కల పొరలు బోదెలపై కప్పి ఉంచాలి. పండ్ల తోటలకు 75 నుంచి 100 మైక్రాన్లు, పూలు, పండ్ల తోటలు ఇతర స్వల్పకాలిక పంటలకు 25, 30, 50 మైక్రాన్ల షీట్లను వినియోగిస్తారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు హెక్టారుకు రూ.35 వేలు ఖర్చవుతుంది. పంటలను సాగు చేసుకునేందుకు రైతు పొలం చదును చేసిన తరువాత విత్తనాలు విత్తే సమయంలో మల్చింగ్ కవర్‌ను తీసుకొని ముందుగా పొలంలో ప్రతి మల్చింగ్ కవర్‌కు నాలుగు ఫీట్ల దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. తర్వాత డ్రిప్పు ద్వారా పంటకు నీరు చేరే సమీపంలో విత్తనాన్ని విత్తే ప్రదేశంలో మల్చింగ్ కవర్‌కు చిన్న రంధ్రం ఏర్పాటుచేసి అందులో విత్తనానికి విత్తనానికి మధ్య సుమారు 60 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తాలి. ఇలా ఏర్పాటు చేసిన మల్చింగ్ కవర్ ద్వారా సుమారు మూడు సార్లు అదే ప్రదేశంలో విత్తనాన్ని విత్తుకొని పంటలను సాగు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు తెలియజేస్తున్నారు.

**ప్రయోజనాలు..**

- 30 నుంచి 80 శాతం సాగుకు నీరు ఆదా అవుతుంది.
- 70 నుంచి 90 శాతం కలుపు మొక్కల బెడద తగ్గించుకోవచ్చు.
- ఎరువులు వృథా కాకుండా సమర్థవంతంగా మొక్కలకు అందుతుంది.
- వ్యవసాయ కూలీల ఖర్చు తగ్గింపు.
- వేరు భాగంలో అనుకూలమైన వాతావరణం పెంచి వేరు వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది.
- వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుంది.
- విత్తనం మొలకెత్తేందుకు అనుకూలమైన వాతావరణం పెంచుతుంది.

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దు

- వివిధ శాఖల అధికారులతో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష
- పార్కింగ్, పారిశుధ్యం, క్యూలైన్లపై దిశా నిర్దేశం
- ఐటీడీఏ పీవో, అదనపు కలెక్టర్‌తో కలిసి పనుల పరిశీలన



పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీవో అంకిత్

తాడ్వాయి, జనవరి 3 : మేడారం అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమ్మక్క-సారలమ్మల మహా జాతర ఏర్పాట్లపై పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ అధికారులతో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆమె మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, క్యూ లైన్లు తదితర ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆలయ ప్రాంతంలో చేపట్టిన ఎండోమెంట్ పనులను పరిశీలించారు. మేడారం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ డార్మిటరీ భవనం వెనుక పూజారులకు గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే వీవీఐపీ పార్కింగ్, కల్వర్టు నిర్మాణం, వెంగళాపూర్, చింతల్ వద్ద పార్కింగ్ స్థలం చదును, కొత్తూరు, ఊరట్టం వైపు జంపన్న వాగులో ఓపెన్ వెల్ పూడికతీత తదితర పనులను పరిశీలించారు. పీఆర్, ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్, పీవో వెంట ఈవో రాజేందర్, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీపీవో వెంకయ్య, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, ఏపీవో వసంతరావు తదితరులు ఉన్నారు.

# ములుగు ఎస్పీగా శబరీష్

గౌష్ ఆలం ఆదిలాబాద్‌కు బదిలీ



పీ శబరీష్

ములుగు, జనవరి 3(నమస్తే తెలంగాణ) : ములుగు ఎస్పీగా 2017 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి డాక్టర్ పీ శబరీష్‌ను నియమిస్తూ సీఎం శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న గౌష్‌ఆలంను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ములుగు ఓఎస్డీ అశోక్‌కుమార్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్డీగా బదిలీ చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత రెండో ఎస్పీగా గౌష్‌ఆలం ములుగు ప్రజలకు విశేష సేవలందించారు. వరద సమయంలో ప్రత్యేకంగా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాల్లో పోలీస్ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందించడంతో పాటు కొంగాల జలపాతంలో వరదల్లో చిక్కుకున్న పర్యాటకులను కాపాడి తన మార్క్ చాటుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# సీఎం ఓఎస్‌డీగా ముల్కనూరువాసి

వేముల శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు.. స్వగ్రామంలో హర్షాతిరేకాలు



వేముల శ్రీనివాసులు

భీమదేవరపల్లి, జనవరి 3 : సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరుకు చెందిన వేముల శ్రీనివాసులును నియమిస్తూ సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసులు నియామకం కావడంపై గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తప్పని పరిస్థితుల్లో అమ్మమ్మ ఊరైన ముల్కనూరుకు వచ్చి తల్లి అనసూయతో స్థిరపడ్డాడు. కిరాణా దుకాణం నడిపిస్తూ పిల్లలను చదివించి ప్రయోజకులను చేసిందామె. అత్యంత పేదరికాన్ని ఎదుర్కొన్న ఆ తల్లి తన ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించింది. ఇందులో చిన్నవాడైన శ్రీనివాసులు పదో తరగతి వరకు ముల్కనూరులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఆ తర్వాత వరంగల్, హైదరాబాద్‌లో ఉన్నత విద్య పూర్తిచేసి మొదట స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో మంచి ఉద్యోగం సాధించాడు. ఇలా అంచెలంచలుగా ఎదిగి క్రమశిక్షణతో ప్రస్తుతం ఐజీగా పని చేస్తున్నారు. ఆయన ఉద్యోగ నిబద్ధతను గుర్తించిన ప్రభుత్వం సీఎం ఓఎస్‌డీగా నియమించింది. దీంతో గ్రామంలో శ్రీనివాసులుతో చదువుకున్న మిత్రులు, బంధువులు, గ్రామస్తులు సంబురపడుతున్నారు. గతంలోనే ఇతర మిత్రుల సహకారంతో ప్రజాగ్రంథాలయాన్ని స్థాపించి మంచి పేరును తెచ్చుకున్న శ్రీనివాసులు.. ఓఎస్‌డీగా మరింత పేరు తెచ్చుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

# మానుకోట కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్

రంగారెడ్డి జిల్లాకు శశాంక బదిలీ



అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : జిల్లా కలెక్టర్ శశాంక రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్ సింగ్‌ను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ రెండేళ్ల పాటు విధులు నిర్వర్తించిన శశాంక జిల్లా ప్రగతిపై తనదైన ముద్ర వేశారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారు. అనేక ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను త్వరగా పూర్తి చేశారు. ప్రధానంగా గత నెలలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలను ఎలాంటి సమస్యలు లేకుండా సాఫీగా నిర్వహించారు.




మాట్లాడుతున్న గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న

# ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలి


**గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్ వెంకన్న**

**పాఠశాలలో ఇగ్నైట్ ఫెస్ట్ ప్రారంభం**

వరంగల్ చౌరస్తా, జనవరి3: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలంగాణ గిరిజన సాంఘిక సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ డీఎస్. వెంకన్న అన్నారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని యాకుబ్‌పురలోని గిరిజన సాంఘిక సంక్షేమ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఇగ్నైట్ 2023-24 పేరుతో ఏర్పాటు చేసిన రెండు రోజుల సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర, సాంకేతికతపై ఎప్పటికప్పుడు విద్యార్థులు అధ్యయనం చేయాలని అన్నారు. నేటి ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతికత ఎప్పటికప్పుడు మార్పులు చెందుతూ వస్తున్నదన్నారు. వీటిని అందిపుచ్చుకోవడం మూలంగా ఆధునిక ప్రపంచంలో మనదైన ముద్ర వేయగలమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా శాస్త్ర సాంకేతికతలో వస్తున్న మార్పులను పరిశీలించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు శ్రీనివాసరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, రీజినల్ పరిధిలోని 24 పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# డైస్ కోడ్ కొట్టు.. సమాచారం పట్టు

- పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ఊతం యూడైస్ ప్లస్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ
- దీని ఆధారంగానే విద్యార్థులకు సంక్షేమ ఫలాలు



కురవిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్, హాజరైన హెచ్‌ఎంలు(ఫైల్)


నెల్లికుదురు, జనవరి 3 : దేశంలో ఎక్కడి నుంచైనా సరే యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం(యూడైస్) ప్లస్ సైట్‌లో స్కూల్ డైస్ కోడ్ కొట్టి ఆ స్కూల్ సంక్షిప్త సమాచారం తెలుసుకోచ్చు. ఇది స్కూల్ సంక్షిప్త సమాచారానికి కేరాఫ్ అని చెప్పవచ్చు. యూడైస్ ప్లస్‌లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఆ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు అందుతాయి. డైస్‌లో పాఠశాలల సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో కొనసాగుతోంది. ఈమేరకు జిల్లా స్థాయి కో-ఆర్డినేటర్లకు రాష్ట్రస్థాయిలో, మండల కో-ఆర్డినేటర్లకు జిల్లాస్థాయిలో, ఉపాధ్యాయులకు మండల స్థాయిలో అవగాహన సదస్సులు పూర్తయ్యాయి.

ఒక పాఠశాలలో ఎంతమంది విద్యార్థులున్నారు? ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారు? పాఠశాలలో ఉన్న మౌలిక సౌకర్యాలేమిటి? ఇంకా ఏమైనా కల్పించాల్సి ఉందా ? విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విద్యాశాఖ అమలుచేసే కార్యక్రమాలు, తదితర అన్ని అంశాలపై విద్యాశాఖకు ఉపయోగపడేది యూ డైస్‌ప్లస్. ఏటా పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారాన్ని ఈ సైట్‌లో ఆన్‌లైన్ చేస్తుంటారు. దాని ఆధారంగానే విద్యార్థులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తుంది. విద్యాశాఖకు కేటాయించాల్సిన బడ్జెట్‌కు కూడా ఇదే ప్రామాణికమవుతుంది. యూడైస్ ఆన్‌లైన్ ప్రక్రియపై జిల్లా స్థాయి కో-ఆర్టినేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. డిస్ట్రిక్ట్ లెవల్‌లో మండల స్థాయి కో-ఆర్డినేటర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, సీఆర్పీలకు శిక్షణ ఇవ్వగా మండల స్థాయిలో మండల కో-ఆర్డినేటర్లు ఉపాధ్యాయులకు యూడైస్ ప్లస్‌పై అవగాహన కల్పించారు.

**అన్నింటికీ ఆధారం..**



యూడైస్ ప్లస్ సమాచారం అన్నింటికి ఆధారం. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, రాగిజావ తదితర వాటన్నింటికీ ఈ యూడైస్ ప్లస్ సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ సమాచారం ఆధారంగానే పాఠశాలల్లో మౌలిక వసతులకు బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయి. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వాటిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వివరాలు సైతం ఈ సమాచారం ఆధారంగానే తీసుకుంటారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, జిల్లా కో-ఆర్డినేటర్లు పర్యవేక్షణ చేసి పరిశీలించారు. - పి.రామారావు, డీఈవో, మహబూబాబాద్



డోర్నకల్ మండలంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ప్రతాప్(ఫైల్)

**యూడైస్ ఆన్‌లైన్ ప్రక్రియ ఇలా..**

- యూడైస్‌ప్లస్ జీవోవీ.ఇన్(స్పేస్ లేకుండా ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి)
- లాగిన్ ఫర్ ఆల్ మాడ్యూల్స్‌పై క్లిక్ చేయాలి.
- ప్రొఫైల్ అండ్ ఫెసిలిటీ, టీచర్ మాడ్యూల్, స్టూడెంట్ మాడ్యూల్‌లను స్కూల్ డైస్ కోడ్, పాస్‌వర్డులతో లాగిన్ అయి అప్డేట్ చేయాలి.
- ప్రొఫైల్ అండ్ ఫెసిలిటీ మాడ్యూల్‌లో స్కూల్‌కు సంబంధించిన సమాచారం అంత అప్‌లోడ్ చేయాలి.
- టీచర్ మాడ్యూల్‌లో ఉపాధ్యాయుల సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి.
- స్టూడెంట్ మాడ్యూల్‌లో విద్యార్థుల సమాచారం మొత్తం అప్‌లోడ్ చేయాలి.

**ఆ తర్వాత ఆన్‌లైన్‌లో ప్రొఫైల్ అండ్ ఫెసిలిటీని డౌన్‌లోడ్ చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎం సంతకం చేసి, స్టాంప్ వేసి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ద్వారా ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుతాయి.**

**ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ**

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు యూడైస్ ప్లస్ ఆన్‌లైన్‌లో పొందుపర్చిన సమాచారాన్ని జిల్లా కో-ఆర్డినేటర్లు షెడ్యూల్ ప్రకారం పర్యవేక్షించి పరిశీలించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5013 పాఠశాలల్లో 5,56757 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలవారీగా యూడైస్ ప్లస్ ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. మహబూబాబాద్ జిల్లాలో 1215 పాఠశాలల్లో ప్రొఫైల్ ఫెసిలిటీని వంద శాతం పూర్తిచేయగా 100176 మంది విద్యార్థుల అప్‌డేషన్ 99 23శాతం పూర్తయింది. వరంగల్ జిల్లాలో 1059 పాఠశాలల్లో 122192 మంది విద్యార్థుల అప్‌డేషన్‌తో 97.32 శాతం పూర్తయింది. జనగామలో 666 పాఠశాలలకు గాను 665 స్కూళ్లలో ప్రొఫైల్ ఫెసిలిటీ పూర్తికాగా 76652 మంది విద్యార్థుల అప్‌డేషన్‌తో 99.69 శాతం పూర్తయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 543 పాఠశాలకు గాను 542 పాఠశాలలు ప్రొఫైల్ ఫెసిలిటీని 99.82 శాతం పూర్తి చేయగా 44995 మంది విద్యార్థుల అప్‌డేషన్‌తో 99.79 శాతం పూర్తయింది. ములుగు జిల్లాలో 565 పాఠశాల్లో వంద ప్రొఫైల్ ఫెసిలిటీని చేయగా 42943 మంది విద్యార్థుల అప్‌డేషన్‌తో 99.80 శాతం పూరైంది. హనుమకొండ జిల్లాలో 965 పాఠశాలకు గాను 964 పాఠశాలలు ప్రొఫైల్ ఫెసిలిటీని 99.90 శాతం పూర్తి చేయగా 164399 మంది విద్యార్థుల అప్‌డేషన్‌తో 99.85 శాతం పూర్తయింది.